


# 10

# సుందరం కలలది ఏ రంగు?

సుందరం ప్లాస్టిక్ సంచిలో వైను బాటిల్‌ని, బంతిపూల మాలల్ని పెట్టుకుని వెళుతున్నాడు. సంచిలోంచి తొంగిచూస్తున్న బంతిపూలు, పసుపురంగు వెలుగుల్ని రోడ్డంతా విరజిమ్ముతున్నాయి. వేసవికాలపు ఉదయం. గాలిలో వెచ్చని సూర్యుడి శ్వాస. దారులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. రోడ్డుకి రెండు వైపుల పెద్ద హోర్డింగులు. రోడ్డు పక్కన ఆపుకున్న ఖరీదైన కార్లలోంచి ఎఫ్.ఎమ్.రేడియోల గోల. కార్లలోని మనుషులు దిగి రోడ్డు అంచున జాగింగ్ చేస్తున్నారు.

రోడ్డుకు ఒక చివరన ఆమె ఒక్కతే నడుచుకుంటూ వెళుతోంది. తల వంచుకొని నడుస్తున్న సుందరం వైపు దీక్షగా చూసి పలకరింపుగా నవ్వింది. 'హలో' అంటూ గొణిగింది. నాలుగడుగులు నడిచినాక సుందరం వెనక్కు తిరిగాడు. ఆమెను వెంటనే పోల్చుకున్నాడు. ఇరవైయేళ్ల (లేదా పాతికేళ్ల) తరువాత ఆమెను చూస్తున్నాడు. ఆ కళ్లలోని వెలుగు, మనోహరమైన నవ్వు. కొద్దిగా అల్లరి చేస్తూ, కొద్దిగా గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ, దేవుడిచ్చిన కలలాంటి ఆ మనిషిని గుర్తుపట్టాడు. గుండె వేగంగా కొట్టుకుంది. "కమలా" అంటూ పిలిచాడు ఆశ్చర్యంగా, ప్రేమగా. 'వెంటనే గుర్తుపట్టలేక పోయాను" అన్నాడు సంజాయిషీగా.

"పెద్దవాళ్లం అయిపోయాం కదా!" అంది తలపైన కప్పుకొన్న కొంగును తొలగిస్తూ. గుబురుగా ఉన్న జుట్టుపై తెల్లటి నీటిపాయల్లా కనిపిస్తున్నాయి నెరిసిన వెంట్రుకలు.

తన గమ్యం వైపు ముందుకు వెళ్లాలో, ఆగి ఆమెతో కాసేపు గడిపి వెళ్లాలో తేల్చుకోలేకపొయ్యాడు సుందరం.

దయగల దేవతలా ఆమె ప్రసాదించిన రోజులు గుర్తుకొచ్చాయి. కత్తులు దూసి జడిపించిన ఒక కాలం గుర్తు కొచ్చింది. ఆమె పాదం మోపినంత మేరా అతని జీవితం పచ్చని తోటలా కళకళ లాడటం గుర్తుకొచ్చింది.

"నిన్న ఉదయం వచ్చాను. మేడ్చల్ రైల్వేస్టేషన్ వెనుక మాకు కాస్త స్థలం వుంది. అందులో రెండు రేకుల షెడ్డులు వేసి అద్దెకు ఇచ్చాము. అద్దె కోసమని వెళితే అక్కడ షెడ్డులేదు, స్థలం లేదు. ఆ ప్రదేశమంతా పెద్ద ప్రహరీ గోడ కట్టేశారు. 'దిస్ సైట్ బిలాంగ్స్‌టు...' అంటూ ఎవడో సేట్‌జీ పేరు రాసుంది. ఏం, చెయ్యాలో కాళ్లు చేతులు ఆడలేదు. మావాడికి చెబితే వాడు పెద్దపెద్దగా అరుస్తాడు. పోలీసు కంప్లైంటు ఇవ్వ మంటాడు. పేపరు వాళ్లతో చెప్పమంటాడు. ఆడకూతుర్ని ఇవన్నీ నావల్ల అయ్యే పనేనా? పిచ్చిదాన్లా ఆ స్థలం చుట్టూ తిరుగుతున్నాను." అంది ఆమె, విషయం అతనికి తెలిసి తీరాలన్నట్లు.

అతనికి ఏం మాట్టాడాలో అర్థంకాలేదు. ఈ కబ్జాలు, ఇవన్నీ ఈ ప్రాంతాల్లో మామూలు విషయాలు. రోడ్డు పొడుగునా ఇట్లాంటి కథలే వినిపిస్తుంటాయి. ఇవాల్టి కథ యిది.

కమల వెంటనే తేరుకొని, కళ్లలోని ఆందోళనని తుడిచేసి (కొడుకు చేసే బెదిరింపులు కాసేపు మర్చిపోయి), తనదైన మనోహరాన్ని ముఖం పైకి తెచ్చుకుని, "ఎట్లా ఉన్నావయ్యా, ఎన్నేళ్లయింది నిన్ను చూసి. పిరికిగా, భయంగా ఉండేవాడివి. గట్టిగా పట్టుకుంటే కందిపోయే పూవులా ఉండేవాడివి" అని, కొద్దిగా లోగొంతుతో కళ్లలో చిలిపితనాన్ని పలికిస్తూ, "ఆడమనిషిని ముట్టుకోడానికి కూడా భయపడేవాడవి" అంది, సన్నగా నవ్వుతూ. అతని ముఖంలో నవ్వు వెలిగింది. ఆమెను చూసిన వెంటనే కలిగిన కంగారు. వింత అసౌకర్యం తగ్గిపోయాయి. ప్రేమగా ఆమె చెయ్యి పట్టుకొన్నాడు. ఆమె చేతిని మృదువుగా నొక్కాడు. ఖాళీగా ఉన్న ఆ రోడ్డుపై వాళ్లిద్దరు, ప్రేమకథలోని దృశ్యంలా నిలబడ్డారు. ఫర్లాంగ్ దూరం నడిచి ఒక హోటల్ (కెఫే)లోకి వెళ్లారు.

ఆ హోటల్ అద్దాల మహల్ లాంటిది. (సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కోసం కట్టింది). ఆ ఉదయం వాళ్లిద్దరే కస్టమర్లు. క్రమంగా సుందరం లో ఉత్సాహం, ఆనందసంచలనం మొదలైనాయి. నిశ్శబ్దంలోంచి, మొరటుదనంలోంచి, కసిలోంచి ఒక కొత్తమనిషి బయటకు వస్తున్నాడు. నిజానికి ఆ ప్రదేశాన్ని భయకంపితం చేయడానికి వచ్చిన మనిషి

అతను. ఆ క్షణంలో అతని బట్టల చాటున ఒక కత్తి, నాటు తుపాకి ఉన్నాయి. అవసర మైతే మనుషులపై దాడిచేసి, గాయపరచి. ఆవేల్టి అతని ఉద్యోగం అదే. కబ్జా చెయ్యబడ్డ ఒక స్థలాన్ని కాపాడాల్సిన ఉద్యోగం. స్థలం చుట్టూ రాత్రికి రాత్రే కంచె మొలిచింది. ఒక పూరిపాక వెలిసింది. (ఆ పాకను అలంకరించడానికే బంతిపూల మాలలు తీసుకెళు తున్నాడు) ఇవాళ నుంచే అతని ఉద్యోగం మొదలు. ఆ స్థలాన్ని నెలరోజులు కాపాడితే, యాభైవేలు.

అయితే, ఆ హోటల్‌లో ఆమె ఎదురుగా కూర్చున్న సుందరం క్షణంపాటు అన్నీ మర్చిపోయాడు. ఇరవైయేళ్లనాటి ఒక ఇష్టమైన దృశ్యంలోకి వెళ్లిపోయాడు. ఆడమనిషిలో కాస్త బెరుకు కనిపిస్తోందిగానీ, ఆమె కూడా అతని తొలి జ్ఞాపకాల్ని ఇష్టంగా గుర్తు చేసుకుం టోంది.

కెఫే గాజు అద్దాల్లోంచి, బయట అంతా నీలిరంగు సరస్సులా ఉంది. ఆ సరస్సు లోంచి మొలుచుకొచ్చిన రంగు రంగుల బొమ్మల్లా మేడలు, అపార్ట్‌మెంట్లు. కెఫేలో వాళ్లిద్దరే కష్టమర్లు. పైన ఎత్తుగా వేలాడదీసిన టీవీలోంచి హిందీ రీమిక్స్ పాటలు. చర్మపు బొమ్మల్లా అవయవాల్ని అటూ ఇటూ విసిరేస్తున్నారు అందులోని అమ్మాయిలు.

కెఫేవాడు తెచ్చిన ఇడ్లీలను చాలా ప్రేమగా తిన్నారు వాళ్లు. "బాగున్నాయి కదా," అన్నాడు ఆమెతో. అవునన్నట్టుగా తల ఊపిందామె. టేబుల్ పైనున్న ఆమె చేతిపై తన చెయ్యి వేశాడు. ఆ స్పర్శకు ఆమె ముఖంలో వెచ్చని ఆవిర్లు ముసిరాయి. ముఖం ఎర్రగా మారి, కళ్లలో సిగ్గులాంటి భావం కదలాడి, అంతలోనే తన వయసు గుర్తుకొచ్చి, అంతట్నీ తుడిచేసి, సన్నని నిర్లిప్తపు నవ్వు నవ్వింది.

దోసె, ఉప్మా... ఒకదాని తరువాత ఒకటి. చాలా రోజులు ఆకలితో ఉన్నవాళ్లలా ఆర్డరు చేస్తున్నారు. అతని కళ్లనిండా ఎప్పటివో జ్ఞాపకాలు. మాజిక్ షోలా అప్పటి దృశ్యాల్ని ఇప్పుడు గుర్తు చేసుకుంటే, అవన్నీ ఇంద్ర జాలికుడి ఫీట్సులాగా కనపడ సాగాయి అతనికి. అతని ఇరవై ఏళ్ల యవ్వన జీవితంపై రంగుల్ని వెదజల్లుతూ ఆమె.

ఆశ్చర్యాన్ని కలిగించే సంగతి ఆమె. ఏమీలేని శూన్యంలో ఒక మాయ తలుపును సన్నగా తోసి, అతని కోసం ఒక గదిని సృష్టించింది.

అతనప్పుడే ఇంట్లోంచి వచ్చేశాడు. ప్రాణమైన తల్లి చనిపోయింది. స్కూల్ ఫైనల్‌తో చదువాగిపోయింది. తండ్రి అంటే ద్వేషం. తల్లిని హింసించే, వేధించే రాక్షసుడికి దూరంగా వెళ్లాలని కోరిక. రౌడీలా తిరగడం, చిన్నచిన్న దొమ్మీలు. "ఆడపిల్లల ముఖంలా లేతగా ఉంటుంది. నువ్వు రౌడీవేంటయ్యా" అనేది కమల. పిక్ పాకెటింగ్, గుడుంబా తాగటం, అప్పటికే రెండుసార్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వచ్చాడు. రాత్రుళ్లు సినిమాహాళ్ల సందుల్లో, చీకటి సందుల్లో మనుషుల్ని ఆపి, దోచుకోవటం కూడా మొదలుపెట్టాడు. తండ్రి, అన్న, చెల్లి అతన్ని దాదాపుగా ఇంట్లోంచి వెలివేశారు.

బస్సు స్టేషన్‌లో పరిచయమైంది కమల. తనలాంటి మొరటు మనిషి ఆమెకు నచ్చటం ఇంకా ఆశ్చర్యం సుందరానికి. దాదాపు ఐదు నెలలపాటు ప్రతి శనివారం కలిసేవాళ్లు. ఆమె స్పర్శ అతనికో అద్భుతం. శరీరమంతా అల్లుకుపోయే ఆమె స్పర్శ, అతనిలో కాంతిని వెదజల్లేది.

గదిలో అతను బొత్తిగా సెక్స్ గురించి తెలియని శిశువులా ఉండేవాడు. ఆమే చొరవ చూపేది. అతని మెడ చుట్టూ చేతులు వేసి, గట్టిగా ముద్దుపెట్టి. ఆ తరువాత మహాజ్వాలలా చెలరేగేవాడు. ఆమె ఉక్కిరిబిక్కిరి అయ్యేది. మోహతీవ్రతలో ఆమె కలవరింతలోకి వెళ్లేది. పాటలు పాడేది. చిన్నపిల్లలా గెంతులేసేది.

ఆమెకు అప్పటికే పెళ్లి నిశ్చయమైంది. అయినా అతన్ని ఎందుకు ఇష్టపడిందో సుందరానికి అంతుపట్టలేదు. చాలాసార్లు అడిగేవాడు. ఆమె సమాధానం చెప్పేది కాదు. కొంటెగా ప్రేమ గురించిన సినిమా పాట పాడేది. గంటలుగంటలు మాట్లాడేది. కొంత నిజం, చాలా కల్పనా, కొద్దిగా భయపడ్డట్టే ఉండేది. అంతలోనే ధైర్యం నటించేది. ఆమెది అంత మంచి ఆరోగ్యం కాదు. ఆస్మా కోసమని ఎప్పుడూ మందులు మింగుతుండేది.

తన గురించి చెప్పేటప్పుడు సుందరం ముఖ్యంగా తల్లి గురించి చెప్పేవాడు. తల్లిపై అతనికున్న ఆరాధన చూసి చలించిపోయేది. వాళ్ల అమ్మ ఫొటో ఒకటి తీసుకుని తన పర్సులో దాచిపెట్టుకుంది. తల్లి ఫొటోను ఆమె అట్లా దాచుకోవటం అతనికెంతో ఆనందాన్ని ఇచ్చింది.

ఆ హోటల్‌లో ఆమె ఎదురుగా కూర్చున్న సుందరానికి అప్పటి రోజులు అద్భుతంగా తోచాయి. అతని జ్ఞాపకాల్లోంచి అప్పటి కథ దృశ్యాలు దృశ్యాలుగా వాళ్ల చుట్టూ మూగింది. సుందరం మైమరచిపొయ్యాడు.

ఐదు నెలల పదిరోజుల తరువాత, సుందరం హఠాత్తుగా ఆమె ప్రపంచం నుంచి దూరమైనాడు. చిన్న చిన్న దొంగతనాలు మాత్రమే చేసే అతను అప్పుడు ఒక మనిషిని పొడిచాడు. పొడిచిన తరువాతగాని అతనికి అర్థంకాలేదు... భయంకరమైన నరకంలాంటి జీవితం అతనికి ఎదురుకానున్నదని. అతన్ని అన్నగా గుర్తించని చెల్లెలు ఒకసారి ఫలానా వాడు నన్ను మోసం చేశాడు, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఇప్పుడు దేన్తోనో పెళ్లి కుదుర్చు కున్నాడు, అని కబురుచేసింది. ముందు ఒట్టినే బెదిరిద్దామనుకున్నాడు. వాడు చాలా పొగరుగా మాట్లాడాడు. ముఖ్యంగా అతని కుటుంబం గురించి, అతని తల్లి గురించి బూతుమాట మాట్లాడేసరికి తట్టుకోలేకపొయ్యాడు. కత్తితో ఆరుపోట్లు పొడిచాడు. పన్నెండేళ్ల జైలు శిక్ష. జైలు అతన్ని పూర్తిగా ధ్వంసం చేసింది. అతని మనుషులు (అన్న, చెల్లి, తండ్రి) ఎవరూ జైలువైపు రాలేదు. కానీ చాలా నెలల పాటు కమల వస్తుందేమోనని ఎదురుచూశాడు. ఊహు, ఏ అతిథీ అతని కోసం రాలేదు.

ఆమె ఏ భావం లేనట్లుగా చూస్తోంది. కలలాంటి మనిషి. కల వెళ్ళిపోయి చాలా యేళ్ళు అయిపోయింది అన్నట్లుగా సుందరం వైపు చూస్తోంది. అయితే అతనిపై ఇష్టం చనిపోలేదు. ఇరవై ఏళ్ళలో అతను పెద్దగా మారలేదు. నేర చరిత్రల వాళ్ళు చాలామంది మొరటు గా దేనిమీదా నమ్మకం లేని వాళ్ళలా ఉంటారు. కాని ఈ మనిషి ముఖంలో ఇంకా లేతదనం పోలేదు. ఎర్రటి ముఖంలో కనపడని అమాయకత్వం ఏదో. కాలం అతని శరీరంలో మార్పు తేకపోవటం ఆమెకు కాస్త అసూయగా ఉంది. (ఆమె జుట్టు నెరసి, అవయవాలు వడలిపోయి, ఆమె గర్వపడే అందమంతా అదృశ్యమయి.) నిజానికి అతన్ని కలుసుకోవటం ఇష్టంగా ఉంది కాని, కొడుకు గురించిన భయం ఆమెను వెంటాడుతోంది. (భర్త చనిపోయిన తరువాత, భర్త చూపిన హింసా, అధికార ప్రదర్శన ఇప్పుడు కొడుకు చూపిస్తున్నాడు.) కొడుకుకు తల్లి గురించి సదభిప్రాయం లేదు. గౌరవ నీయమైన భార్యలా, మంచి తల్లిలా ఆమె నడుచుకోవటం లేదని అతని వాదన. తండ్రి మరణం తరువాత ఆమె గుండు గీసుకుని, తెల్లచీర కట్టుకొని, ఒక మూలన అంట్లు తోముకుంటూ పనులు చేసుకుంటూ జీవించాలని అతని కోరిక.

ఆమె ఎప్పట్లాగే హుషారుగా రంగులచీరలు, టీవీ సీరియళ్ళు, సిటీకి వెళ్ళి రావటాలు చేయడం అతనికేం నచ్చలేదు. కొడుకు భీకరస్వరం, అసహ్యం కలిగించే మాటలంటే ఆమెకు భయం. నిన్నటి నుంచి కనీసం యాభైసార్లు ఫోన్ చేసి ఉంటాడు. తప్పంతా ఆమెదే అన్నట్లు మాట్లాడతాడు. ఎట్లాగయినా ఆ స్థలాన్ని తిరిగి సాధించ మంటాడు. ఉదయం ఫోన్ చేసినప్పుడు మరీ రాక్షసంగా మాట్లాడేడు. తెలుగుదేశం పార్టీ మనిషి ఒకణ్ణి కలిసి, రేపటి నుంచే ఆ స్థలంలో ధర్నా చెయ్యమంటాడు. నిరాహార దీక్ష చెయ్యమంటాడు. టీవీ 9 వాళ్ళకు కబురుచేసి, కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ విషయం చెప్పమంటాడు. 'ఇన్ని చేసినా ఫలితం లేకపోతే నిన్ను చంపి, ఆత్మ హత్య అని పబ్లిసిటీ ఇచ్చి గవర్నమెంటును బ్లాక్‌మెయిల్ చేస్తాను,' అన్నాడు (చాలా సీరియస్‌గా).

ఆమెకు లోలోపల చాలా అసౌకర్యంగా ఉంది. అతన్ని చూడటం ద్వారా కలిగిన ఆనందాన్ని ఎక్కువసేపు నిలుపుకోలేక పోయింది. కొడుకు బెదిరింపులే గుర్తుకొస్తున్నాయి. 'చంపి, ఆత్మహత్య గా' అనే మాటలు ఆమెను కంగారు పెడుతున్నాయి. ('అంత కఠినుడే వాడు' అని కూడా అనుకుంది.)

"కమలా, ఇక్కడకు దగ్గరలోనే నేనుండే గది" అన్నాడు సుందరం ఏదో సూచన ఇస్తున్నవాడిలా. ఆమె ముఖంలో ఏ స్పందనా లేదు.

"మావాడి గురించే భయపడుతున్నాను. నోటికి ఎంత మాట వస్తే అంత మాట అనగలడు. కిరాతకపు వెధవ," అంది తన మనసులోని ఆందోళనను అతనికి తెలియ చేస్తూ. అతనికి ఏం మాట్లాడాలో తెలియలేదు. 'మనుషులంతా ఇంతే, ఇట్లా కిరాతకం

గానే ఉన్నారు' అని చెప్పాలనిపించింది. అతనికి నోరు పెగల్లేదు. అతనికి అందంగా మాట్లాడటంరాదు. ఆ మనిషిని చూసిన తరువాత ఎందుకో అతనిలో ఆనందంలాంటిది కలిగిందనిపించింది. ఆమె అంటే తనకెంతో ఇష్టమని గట్టిగా అరిచి చెప్పాలనిపించింది సుందరానికి.

* * *

జైలు నుంచి వచ్చాక సుందరం కొత్త జీవితాన్ని మొదలుపెట్టాడు. ఒక రెస్టారెంట్‌లో క్లీనర్‌గా చేరాడు. నానక్‌గూడాలో చిన్న గదిని అద్దెకు తీసుకున్నాడు. జైలు జీవితం అతని కలలనన్నిటిని ధ్వంసం చేసింది. జీవించటం ఒక ముఖ్యమైన విషయం అనిపించ లేదు. నెలకు ఆరువందలు అద్దె ఇచ్చే ఆ గది, జైలుగది కన్నా గొప్పగా లేదు. పది రూములకు కలిసి ఒక కామన్ బాత్‌రూమ్. దుర్గంధం వెదజల్లే లెట్రిన్. ఆ గదుల్లోనే కొన్ని కుటుంబాలు కూడా ఉంటున్నాయి.

జీవితం ఒక యుద్ధభూమిలా ఉందని వాళ్లను దగ్గరగా చూసినాక అర్థమైంది సుందరానికి. ఏ గదిలో చూసినా మనుషులు తెగిపడ్డ అవయవాల గుట్టల్లా ఉండటం అతను గమనించాడు. కేకలు, అరుపులు, కొట్టుకోటాలు అక్కడ నిరంతరం జరుగుతూనే ఉంటాయి. ఏ అర్ధరాత్రో పెద్ద ఏడుపు వినబడుతుంది. రాత్రంతా ఆ ఏడుపు వెంటాడు తుంది. ఆ గదిలో ఉండటం అతనికి భరించలేని విషయం. అందుకే ఉన్న కాసేపూ ఎవరికీ చెందని మనిషిలా గడిపేవాడు. వరండాలో సైకిల్ తొక్కుతూ కనపడే ఓ పిల్ల, గోలీలాడటం వచ్చా అని అడిగే ఆ పిల్ల తమ్ముడూ అతనికి ఇష్టమైన మనుషులు. ఆ గదుల్లోనే ఒక ముసలి సెక్స్ వర్కర్ ఉందని ఒక పుకారు. రాత్రి పూట మనుషులు వస్తుంటారని కూడా విన్నాడు సుందరం.

సుందరం సెక్స్ జీవితం చాలా నిర్లిప్తంగా ఉండేది. జైలులో వుండగా మాస్టర్బేషన్ అలవాటు అయింది. హోటల్‌లో పనిచేసే చాలామంది సెక్స్‌వర్కర్ల దగ్గరకు వెళుతుండే వాళ్లు. ఎందుకో సుందరానికి సెక్స్ వర్కర్లంటే సదభిప్రాయం లేదు. మగవాళ్ల ఆత్మల్ని నలిపి వేయగలిగే రాక్షసత్వం వాళ్ల దగ్గర ఉందనుకునేవాడు. అతనికి కమల చాలాసార్లు గుర్తుకొచ్చేది. ఆమెతో గడిపిన క్షణాలు గుర్తుకొచ్చేవి. జీవితాన్ని వెలిగించిన క్షణాలు అవి అనుకునేవాడు. 'మళ్లీ కమల కనిపించదా' అని ఆశ పడేవాడు.

సుందరం అన్న ఒకరోజు రెస్టారెంటులో కనబడ్డాడు (అతనో బ్యాంక్ మేనేజరు). కొద్దిగా ఆశ్చర్యం ప్రకటించి, "ఒకసారి ఇంటికి రా, వదిన, పిల్లలు నిన్ను చూడాలంటు న్నారు," అన్నాడు. విననట్లే నటించాడు సుందరం. అతనికి సంబంధించిన వరకూ అప్పటి సంవత్సరాలు, ఆ కుటుంబం అన్నీ అదృశ్యమయినట్లే. ఇంకోసారి చెల్లెల్ని తీసుకొని వచ్చాడు అతని అన్న. చిన్న నవ్వు కూడా సుందరం ముఖంలో వెలగలేదు.

వాళ్లెవరూ అతన్ని తమ సోదరుడిగా ప్రకటించుకోడానికి సిద్ధంగా లేరు. ఇంటికి ఒకసారి అహ్వానించి భోజనం పెట్టి అంతటితో తమ బాధ్యత తీర్చుకోవాలని వాళ్ల ఆలోచన.

ఒకరోజు సికింద్రాబాదు పారడైజ్ సెంటర్లో కమల కనిపించింది. ఊపిరి ఆగిపోయినట్లనిపించింది సుందరానికి. పక్కనే పదేళ్ల కుర్రవాడు ఉన్నాడు. ఈ కమల మారిన కమల, కొద్దిగా వెంట్రుకలు నెరుస్తున్నాయి. ముఖంలో యవ్వనం అదృశ్యమైంది. శరీరం చుట్టూ కొవ్వు పేరుకొని పోయింది. అయినా అ ముఖం అతనికి చిరపరిచిత మైనదే. ప్రియమైనదే.

"బాగున్నావా కమలా," అని పలకరించాడు. ఆమెకు వెనక నుంచి వినబడ్డాయా మాటలు. ఉలిక్కిపడి చూసింది. ఆమె కళ్లలో కంగారు, భయం. వీధి మధ్యలో అతనట్లా ప్రత్యక్షమయితే ఆమె భయంతో బిగుసుకుపోయింది. కొడుకు అసహనంగా ఆమెవైపు చూస్తున్నాడు.

"ఏం కావాలి నీకు," అంది కళ్లలోకి కోపాన్ని తెచ్చుకొని. గొంతులో కరుకుదనం ఉంది. వీధిలో చాలామంది వాళ్లవైపే చూస్తున్నారు. "మీరు అనుకునే మనిషిని నేను కాను," అన్నట్లుగా విసవిసా నడుచుకుంటూ వెళ్లిపోయింది. (కొడుకు చదువుకోసం సిటీకి వచ్చారు వాళ్లు.)

నెల తరువాత, ఒక మధ్యాహ్నం పూట ఇరానీ రెస్టారెంట్‌లో టీ తాగుతున్నాడు సుందరం. వేసవి ఎండ భరించలేని తాపం. తాగుతున్న టీ వదిలేసి, పక్కనున్న బార్‌లో బీరు బాటిల్ తెచ్చుకొని హోటల్ ముందున్న పేవ్‌మెంట్‌పై నిలబడి, బీరు తాగుతున్నాడు. రోడ్డుకు అవతలి వైపున కమల కనిపించింది. ఎందుకో ఆమె వెనకనే వెళ్లాలనిపించింది సుందరానికి. బీర్‌బాటిల్ అట్లాగే చేతిలో పట్టుకొని, ఆమెను వెంబడించాడు. నడుస్తు న్నాడే గానీ, "ఏం కావాలి నీకు," అంటూ నొసలు చిట్లిస్తూ ఆమె అడిగిన ప్రశ్న అతన్ని వెంటాడుతూనే ఉంది. ఎక్కడైనా ఒక పార్కులో (పక్కనే పరిమళాల్ని వెదజల్లే పూల పొద, నీటి జ్ఞాపకాల్ని వినిపించే పిట్ట) రెండు నిమిషాలు ఇద్దరూ కూర్చుని మాట్లాడు కోవటం అతని కోరిక. ఆ రెండు నిమిషాల్లో మొత్తం జీవితం అతని నుంచి దొంగిలించ బడిందని చెప్పుకోవటం మినహా ఏం కావాలి తనకు అనుకున్నాడు.

తల వంచుకొని నడుస్తుంది కమల. చేతిలో బీరు బాటిల్‌తో సహా ఆమెను వెంబడిస్తున్నాడు సుందరం. దగ్గరకు వచ్చినాక, "కాఫీ తాగుదామా కమలా," అన్నాడు. ఉలిక్కిపడిందామె. పెరిగిన గడ్డం, చేతిలో బీరుబాటిల్... భయపడింది. దీనంగా ముఖంపెట్టి, రెండు చేతులు జోడించింది. సుందరం హతాశుడయ్యాడు. 'ఇంక చాలు వెళ్లు,' అన్నట్టున్నాయి ఆమె చూపులు. అయినా ఆల్కహాలు ఇచ్చిన ఉత్సాహంతో ఆమె

వెనకనే నడవటం మొదలుపెట్టాడు. పాట్నీ సెంటరు వెనుక ఇరుకైన సందులో, ఒక శిథిలమైన అపార్టుమెంటులోకి నడిచింది. "సెకండ్‌ఫ్లోర్‌లో మా యిల్లు. ఆయన, పిల్లవాడు ఇంట్లోనే ఉన్నారు. అర్థం చేసుకో సుందరం," అంది దీనంగా ముఖంపెట్టి. ఆ రెండు మాటలు సుందరంలో మార్పును తెచ్చాయి. మౌనంగా వెనక్కు నడుచుకుంటూ వెళ్లాడు.

రెండు వారాల తరువాత, ఒక రాత్రివేళ హోటల్ నుంచి వస్తుండగా ఎందుకో కమల ఇంటికి వెళ్లాలనిపించింది సుందరానికి. ఇంట్లోకి కాదు, అక్కడే ఆ వీధి మొదట్లో అపార్టుమెంటు గేటు బయట, కాసేపు తిరిగి వెళ్లిపోతాను అనుకున్నాడు. ఆ ఆలోచన అతనికి హుషారునిచ్చింది. దోవలో గార్డెన్ రెస్టారెంటులో ఆగి బీరు తాగాడు. రాత్రి పదకొండు దాటి ఉంటుంది. ఆ వీధిలో చాలాసేపు తిరిగాడు. పదేపదే అపార్టుమెంటు ముందు ఆగేవాడు. పిచ్చివాడిలా చేస్తున్నానే అనుకున్నాడు. లోపల ఏ ఉద్వేగమో తోసుకురాగా, ఒక్కసారిగా గేటు తోసుకొని ఆమె ఉండే అపార్టుమెంటువైపు వెళ్లాడు. తలుపు తెరిచే ఉంది. లోపల ఏ అలికిడి లేదు. 'కమలా' అంటూ సన్నగా పిలిచాడు. ఏ సమాధానం రాలేదు. తెరిచిన తలుపులోంచి లోపలికి నడిచాడు. గది మధ్యలో కమల, పగిలిన బొమ్మలా పడి వుంది. గదిలోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. సుందరం గుండె ఆగిపోయినట్లనిపించింది. కమల చనిపోలేదు కదా, అని భయపడ్డాడు. దగ్గరకు వెళ్లి చూశాడు. శ్వాస ఆడుతోంది. శరీరం నిండా గాయాలు, రక్త చారలు. కర్ర తోటో, బలమైన వస్తువు దేనితోనో కొట్టినట్లుగా, ఇంట్లో మరే అలికిడి లేదు. రెండు చేతులతో ఆమెను ఎత్తి మంచంపై పడుకోబెట్టాడు. ఇల్లంతా వెతికి డెట్టాల్, దూది సంపాదించి గాయాల్ని శుభ్రపరిచాడు. ఆమె స్పృహలో లేదు. సన్నని మూలుగు మాత్రం వినిపిస్తోంది. చాలాసేపు ఆమె పక్కనే కూర్చున్నాడు. పాతపేపరు తీసుకుని ఆమెకు విసరడం మొదలుపెట్టాడు. లేచి, ఇల్లు మొత్తం శుభ్రపరిచాడు. రక్తసిక్తమైన చిరిగిన ఆమె వంటి పైన చీరను మార్చాడు. వంటగదిలోకి వెళ్లి కాఫీ చేసుకొని వచ్చాడు. తలను పైకి లేపి ఆమెకు కాఫీ తాగించాడు. నొప్పిని తగ్గించే బిళ్లలు ఆమెతో మింగించాడు. ఆమెపై పల్చటి దుప్పటి కప్పి, నుదుటిని ఒకసారి నిమిరి ఇంట్లోంచి బయటకు వచ్చాడు. తలుపు దగ్గరకు వేసి, మెట్లు దిగి వీధిలోకి వచ్చాడు. కమలను అంత భయానకంగా కొట్టినవాడు (బహుశా ఆమె భర్త) వస్తాడేమో అని వీధిలో నిలబడి చాలాసేపు చూశాడు. వాడు వచ్చి ఉంటే బహుశా సుందరం మరో హత్య చేసి ఉండేవాడు. తెల్లవారి నాలుగుదాకా అపార్టుమెంటు ముందే పచార్లు చేశాడు సుందరం.

కెఫేలో జనం రావటం మొదలుపెట్టారు. ఒక్కళ్లు, ఇద్దరు, జాగింగ్ నుంచి వస్తూ కాఫీనో, టీనో ఆర్డర్ చేస్తూ.

సుందరం ఆమెవైపే చూస్తున్నాడు. అప్పటికే ఇద్దరూ మూడోసారి కాఫీ తాగుతున్నారు. ఆ కాసేపట్లో కమలకు నాలుగుసార్లు ఫోన్ వచ్చింది. కొడుకు చాలా ఆవేశంగా ఉన్నాడు. పాతికలక్షలకు డీల్ కుదిరిందని, ఇక అంతా ఆమె చేతిలోనే వుందని చెప్పాడు. తన జీవితాన్ని నిలపాల్సిన బాధ్యత ఆమెదేనని, మరోసారి గుర్తుచేశాడు. రేపు ఎనిమిదింటికి రెండు వ్యాన్లలో జనాన్ని తీసుకొస్తున్నానని, తెలుగుదేశం జిల్లా నాయకుడు వస్తున్నాడని, నిరాహారదీక్షా శిబిరంలో ఆమె కూర్చోవాలని ఆజ్ఞ వేశాడు. సుందరం ఆమెవైపే చూస్తున్నాడు. కమల ఇప్పుడో రంగులకలలా ఉంది అనుకున్నాడు. ఈ ఒక్క గంటలోనే తనలో వచ్చిన మార్పు అతనికి అర్థమవుతుంది. ఖాళీ జీవితంపై రంగులు కురుస్తున్నట్లుగా. ఉదయం ఎనిమిది గంటలవుతోంది. తాను వెళ్లవలసిన ప్రదేశం గురించి మర్చిపోయ్యాడు. "ఒకసారి గదికి వెళదాం, కమలా" అని మరోసారి అడిగాడు.

కమల కళ్లముందు కొడుకు ముఖం కదలాడింది. నియంతలాగా కేకలు పెట్టే అతని రూపం ఎదురుగా నిలిచినట్లుగా ఉంది. వాడి కళ్లలో ప్రేమ, కరుణ ఎప్పుడూ కనబడేవి కావు. 'ఇది నీ బాధ్యత, చెయ్యక చస్తావా,' అని ఆజ్ఞాపిస్తున్నట్లే ఉంటుంది.

ఎదురుగా కూర్చున్న ఈ మనిషి ఇరవైయేళ్లపాటు తన జ్ఞాపకాల్ని దాచిపెట్టుకున్నాడు. అతని కళ్లనిండా ఎంత ప్రేమ. ఈ మనిషిని కాదనటం ఆత్మహత్య కన్నా ద్రోహం అనుకుంది.

మొత్తం గతాన్ని పక్కకు తోసి, ఈ క్షణాల్ని మాత్రమే తన ఎదురుగా నిలుపుకోవాలనుకొంది. తన లోపల కదలాడే ఇష్టాలే ముఖ్యం. మిగిలిందంతా తనకు సంబంధం లేనిది. అంతట్నీ చేతితో పక్కకు తోసి, ఈ క్షణాల్ని మాత్రం దగ్గరకు తీసుకోవాలనిపించింది.

లోలోపల ఒక స్థిర నిర్ణయం. కొడుకు అనే నియంతను 'పోరా' అంది తీవ్రమైన తిరస్కారంతో. వాడి అరుపులన్నీ పదాలుగా అక్షరాలుగా విడిపోయి రెస్టారెంట్ నిండా కాగితపు ముక్కల్లా ఎగురుతున్నాయి.

కమల ముఖంలో సన్నటి నవ్వు వెలిగింది.

"నీ గదికి తీసుకెళ్లు సుందరం," అంది. తగుమాత్రం సిగ్గు ఆమె ముఖంలో తళుక్కుమంది.

రోజు ఇప్పుడే మొదలైంది. హోటల్ బయట కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతి.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 17 జూన్ 2007*

కథా నిలయం
శ్రీకాకుళం